క్లుప్తంగా

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి ఆశా వర్కర్లకు పిలుపు నిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశా వర్కర్ల జిల్లా 3వ మహాసభలకు హాజరై మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండి పడ్డారు. కార్యక్రమంలో వర్దం పర్వతాలు, ఆర్.శ్రీనివాసులు, ఆంజనేయులు, పాదిల రామయ్య, శంకర్‌నాయక్, శివవర్మ, ఆశావర్కర్లు జయమ్మ, కళావతి, రజిత, శ్రీదేవి, బాగ్యమ్మ, సరల,వరలక్ష్మి, సువర్ణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలి

తాడూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై సరైన నిర్ణయం వెల్లడించాలని సీపీఐ నేత భరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మోదీ ప్రభుత్వం సరైన స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, బంగారయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

17న మెగా రక్తదాన శిబిరం

కందనూలు: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17న మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ యువమోర్చ జిల్లా కార్యదర్శి ధన్నోజు నరేష్‌చారి తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఎస్‌ఐ రామన్ గౌడ్ వాహనాల తనిఖీ నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వాహనానికి సంబంధించిన పేపర్లు తప్పనిసరిగా ఉండాలని, వాహనాలు నడిపే వ్యక్తికి హెల్మెట్ తప్పకుండా ఉండాలని, మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు.

గొర్రెల కాపరి అదృశ్యం



బల్మూర్: మండలంలోని బిల్లకల్ అటవీ ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం గొర్రెల కాపరి అదృశ్యమైన సంఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన మెడమోని రాములు (34) తన భార్య లక్ష్మితో కలిసి బిల్లకల్ శివారు లోని అటవీ ప్రాంతంలో మూడు నెలల నుంచి గొర్రెలను మేపడానికి వచ్చారు. ఈక్రమంలో వారు అవసరమైనప్పుడు గ్రామానికి వెళ్లి వస్తుండే వారు, కాని ఈనెల 8వ తేదీ రాత్రి గొర్రెల మంద వద్ద భార్యాభర్తల మధ్య డబ్బుల విషయంలో ఘర్షణ జరిగింది. ఉదయం నిద్ర లేచి చూసే సరికి భర్త కనిపించ లేదు. దీంతో ఆమె కుటుంబసభ్యులకు, బంధువులకు సమాచారం ఇచ్చింది. రాములు ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. దీంతో రాములు సోదరుడు బాలనాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న పంటల నమోదు



తాడూరు: మండలంలోని అయా గ్రామాల్లో కొనసాగుతున్న పంటల నమోదు ప్రక్రియను శుక్రవారం ఏఓ సందిప్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, దీంతో రైతులకు ప్రభుత్వ పథకాలు అమలుపై అవగాహన కల్పించాలని ఏఈఓలకు సూచించారు. ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా చీడపీడల నివారణపై అర్థమయ్యేలా తెలపాలన్నారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేందర్‌రెడ్డి, కార్యదర్శిగా అశోక్‌ప్రసాద్, కోశాధికారిగా శంకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా నారాయణ, ఉపాధ్యక్షులుగా పుష్పమ్మ, విద్యాసాగర్, జాయింట్ సెక్రటరీగా రామస్వామి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా మురళి, పబ్లిసిటీ సెక్రటరీగా బాలస్వామి, కార్యాలయ ఇన్‌చార్జిగా ఖాజామైనొద్దీన్‌ను ఎన్నుకున్నారు.

ఎన్నాళ్లీ ఇన్‌చార్జి సేవలు?

- ఏళ్ల తరబడిగా లైబ్రేరియన్ లేని శాఖా గ్రంథాలయం
- అసహనం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువకులు
- చెదలుపడుతున్న విలువైన పుస్తకాలు
- ప్రయోజనం లేక పాఠకుల ఆందోళన

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి ఏళ్ల తరబడిగా రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో పాఠకులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరడంలేదు. గత పదిహేనేళ్లుగా ఈ పరిస్థితి కొనసాగుతున్నా పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పాఠకులు, విద్యార్థులు, యువకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ అచ్చంపేట వాసి కావడంతో ఇప్పటికైనా తమ గ్రంథాలయం సమస్య తీరుతుందని ఆశపడ్డ పాఠకులకు నిరాశే మిగిలింది. లైబ్రేరియన్ లేకపోవడంతో అటెండర్ గెల్వయ్య మాత్రం నామమాత్రంగా తెరిచి ఉంచుతాడు. అక్కడికి ఒకటి, రెండు దినపత్రికలు మాత్రమే రావడంతో ఉదయం కొంతమంది యువకులు ఆవరణలో కూర్చొని పత్రికలను చూసి వెళ్తుంటారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే బుక్స్‌తో పాటు వార, మాస పత్రికలు అందుబాటులో ఉంచడంలేదు.

రెండు వేలకు పైగా పుస్తకాలు..

ఈ గ్రంథాలయంలో మంచి మంచి మహనీయులకు సంబంధించిన పుస్తకాలతో పాటు మహాభారతం, పంచతంత్రం, విశ్వరహస్యం వంటి వివిధ రకాలైన 2 వేలకు పైగా పుస్తకాలు ఉన్నా ఎవరికీ ఉపయోగ పడటంలేదు. తమకు చదువుకోవాలని ఉన్నా లైబ్రేరియన్ లేకపోవడంతో పుస్తకాలు ఉన్న గదికి తాళం వేసి ఉంటుంది. కనీసం సెలవు రోజుల్లోనూ గ్రంథాలయంలోని పుస్తకాలు చదివే అవకాశం లేదని వాపోతున్నారు.



రెగ్యులర్ లైబ్రేరియన్ లేని ఉప్పునుంతల శాఖా గ్రంథాలయం



పాఠకులు లేక వెలవెలబోతున్న గ్రంథాలయం

ఒకటి, రెండ్రోజులు ఇన్‌చార్జి లైబ్రేరియన్..

కొన్నేళ్ల నుంచి అచ్చంపేట లైబ్రేరియన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఆమె నెలలో ఒకటి రెండు పర్యాయాలు మాత్రం ఇక్కడకు వచ్చి వెళ్తుంది. కేవలం పేపర్ బిల్లులు ఇవ్వడానికి మాత్రమే ఇన్‌చార్జి లైబ్రేరియన్ వచ్చి వెళ్తుండటంతో పుస్తకాలు చదువుకునే వీలులేకుండా ఉంది. ఎక్కువ రోజులు పుస్తకాలను కదిలించకపోవడంతో విలువైన పుస్తకాలు ఇప్పటికే చెదలు పట్టిపోయాయి. చాలా పుస్తకాలు పాడు కావడంతో వాటిని మూలన పడేశారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రద్ధ తీసుకొని రెగ్యూలర్ లైబ్రేరియన్‌ను నియమించి పదిమందికి ప్రయోజనం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠకులు, విద్యార్థులు కోరుతున్నారు.

రెండు మూడు పేపర్లే వస్తాయి..



స్థానిక గ్రంథాలయానికి రెగ్యూలర్ లైబ్రేరియన్ నియమిస్తే దాని వల్ల పదిమందికి ప్రయోజనం చేకూరుతుంది. గ్రంథాలయంపై శ్రద్ధ తీసుకోకపోవడంతో వార, మాస పత్రికలు లేకపోవడం, రోజు వచ్చే రెండు మూడు దినపత్రికలు మాత్రమే బయట వేస్తే చదువుకోవల్సివస్తోంది. అందుకోసం స్థానికుడైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. గ్రంథాలయం ఎవరికీ ఉపయోగపడటంలేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితంలేదు.

– గుజ్జుల రేంబాబు, పాఠకుడు, ఉప్పునుంతల

రక్తదాతలు.. ఆపద్బాంధవులు

- ఘనంగా ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలు
- క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం

అచ్చంపేట రూరల్: అన్ని దానాలలో కెల్లా రక్తదానం గొప్పదని, సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం అచ్చంపేటలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. అక్కడే అన్నదానం చేశారు. ఉమామహేశ్వరంలో ఎమ్మెల్యే దంపతులు పూజలు నిర్వహించారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర వద్ద ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అశోక్, భాస్కర్‌చారి ఉన్నారు.

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, మహిళలు, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. అంతకు ముందు ఎమ్మెల్యే వంశీకృష్ణను జూపల్లి సమీపాన శ్రీశైలం క్రాస్ రోడ్డు వద్ద కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు.



ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

మన్ననూర్: ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పుట్టిన రోజు వేడుకలను మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో కాంగ్రెస్ అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాణా సంచకాల్చి, స్వీట్లు పంచారు. ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

కొల్లాపూర్: అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదిన వేడుకలను కొల్లాపూర్‌లోని శ్రీవాణి విద్యానిలయంలో నిర్వహించారు. టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు పేదలకు దుస్తులు, పండ్లు, బ్రెడ్లు, చిన్నారులకు స్వీట్లు, నోట్‌పుస్తకాలు పంచిపెట్టారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

అచ్చంపేట: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించి అంకితభావంతో పనిచేయాలని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు కోరారు. మున్సిపాలిటీల్లో వార్డు అధికారులుగా విధులు నిర్వహిస్తూ.. జీపీఓలుగా ఎంపికైన పదిమంది ఉద్యోగుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు.



జీపీఓలను సన్మానిస్తున్న చైర్మన్, కమిషనర్, ఇతర సిబ్బంది

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం అధికారులు ఎక్కడైనా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో జీపీఓలుగా ఎంపికైన వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజకుమారి, ఏఈ షబ్బీర్, టీపీఓ వికాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దండ: మండలానికి ప్రభుత్వం నియమించిన గ్రామ పరిపాలన అధికారులు తహసీల్దార్ కార్తీక్‌కుమార్ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐ శంకర్, తదితరులు ఉన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



అచ్చంపేటలో సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు జయమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

- బిజినేపల్లిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్, నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేశారు.
- అమ్రాబాద్ మండలంలోని తెలుగుపల్లి గ్రామాలలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యదర్శి దశరథనాయక్, శివ, రాము, రాజేష్, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.
- కల్వకుర్తి పట్టణంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.
- పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్, సింగవరం గ్రామాల్లో సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి వర్ధంతిని నిర్వహించారు.
- కొల్లాపూర్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ఉన్నారు.
- అచ్చంపేట పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏచూరి మొదటి వర్ధంతిని నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి సైదులు పాల్గొన్నారు.
- కోడేరు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ, మండల కార్యదర్శి రవి, వెంకటయ్య, రాజేష్, శివప్రసాద్ పాల్గొన్నారు.

బాలాజీ సింగ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



కల్వకుర్తి రూరల్: ఉద్యమ నాయకుడు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు మాజీ జెడ్పీవైస్ చైర్మన్ బాలాజీసింగ్ తండ్రి ఠాకూర్ రతన్‌సింగ్ (86) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యే పాడే మోశారు. ధైర్యంగా ఉండాలని బాలాజీకి సూచించారు. మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, విద్య కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు శ్రీశైలం, ఎడ్మ సత్యం, మాజీ సర్పంచులు సుదర్శన్‌రెడ్డి, జిల్లెల్ల రాములు, కాయితి విజయకుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడి నివాళులర్పించారు.

12వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

కోడేరు: మండలంలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు రాములు, బొజ్జమ్మ, చిన్నరాములు మాట్లాడుతూ తమకున్న కొద్దిపాటి భూమిని ప్రభుత్వం తీసుకొని ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 12 రోజులు కావస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏ ఒక్కరు కూడా తమవైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, శేషయ్య, పాతిమా పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేపట్టిన భూ నిర్వాసితులు

దివ్యాంగులపై వివక్ష తగదు

బిజినేపల్లి: 2016 భారత పార్లమెంట్ ఆమోదించిన వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టంలోని అన్ని హక్కులను అమలు చేయాలని, వ్యక్తిగత హోదా, గౌరవం, సొంత నిర్ణయాలు కల్పించడానికి ఎలాంటి వివక్ష చూపరాదని డిప్యూటీ చీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య అన్నారు. శుక్రవారం మండలంలోని పాలెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నాల్సా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సయ్యద్ మొయినుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన తండాలకు బీటీ రోడ్లు



తిమ్మాజిపేట: మండలంలోని పలు గిరిజన తండాలకు బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ ఎస్టీసెల్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పుట్నాలతండా నుంచి వేముల నాయక్ తండా వరకు, వేముల నాయక్‌తండా నుంచి గుంత తండా వరకు, నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారి నుంచి చౌటచెరువుతండా వరకు, కొత్తతండా నుంచి తుమ్మలకుంట తండా శివాలయం వరకు, సూర్యనాయక్‌తండా నుంచి పుట్నాల తండా వరకు బీటీ రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డికి ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు కొడావత్ రాఘవేందర్‌నాయక్, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రాకపోకలకు అంతరాయం



ఉధృతంగా ప్రవహిస్తున్న బొమ్మల గుడిసెల వాగు

చారకొండ: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లాయి. మండల కేంద్రంలో కత్వనిండి పారుతోంది. మండలంలోని బొమ్మల గుడిసెలు వాగు వరద ప్రవాహంతో గ్రామస్తులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాకపోకలకు అంతరాయం లేకుండా వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ గేట్ ధర్నా



కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేయాలని, ఆర్టీసీ ఆధ్వర్యంలోనే విద్యుత్ బస్సులు కొనేందుకు, నిర్వహణకు అవసరమైన నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంబయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, బాలస్వామి, సింగారం వెంకటయ్య ఉన్నారు.

గ్రూప్-1 మళ్లీ నిర్వహించాలి

కొల్లాపూర్: గ్రూప్-1 పరీక్షలను మళ్లీ నిర్వహించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకులు డీ.శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులతో సమావేశంలో మాట్లాడారు. హైకోర్టు తీర్పు మేరకు గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీజీ విద్యార్థులు ఉన్నారు.

భక్తులకు వైద్య సేవలు



చారకొండ: మండల కేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యులు చిల్వేరు శ్రీనివాసులు వారి తల్లిదండ్రులు మల్లప్ప, మల్లమ్మ స్మారకార్థం శ్రీశైల పుణ్య క్షేత్రంలో భక్తులకు పద్మశాలి సత్రం ఆవరణలో గురువారం, శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్రం అధ్యక్షుడు శ్రీధర్, కార్యనిర్వహక అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వీరయ్య, కోశాధికారి యాదయ్య, సత్రం మేనేజర్ కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి

లింగాల: సామర్థ్యాలను పెంచి ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలని, అందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని ఎంఈఓ బషీర్ అహ్మద్ సూచించారు. మండలంలోని అవుసలికుంట, కొత్తకుంటపల్లి ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

చారకొండ: పంటలు సాగు చేసే రైతులకు యూరియాను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల నాయకులు చింతపల్లి కిరణ్ గౌడ్ ఆరోపించారు.. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యూరియా సరాఫరాపై ప్రభుత్వం ముందస్తు కార్యచరణ చేపట్టలేదన్నారు. నిత్యం మండలాల్లో రైతులు క్యూ కట్టి యూరియా లేక వెనుదిరిగి పోతున్నారన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కన్న, పవన్, శ్రీకాంత్ ఉన్నారు.

కల్వర్టులు నాణ్యతగా నిర్మించాలి

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల, కంటోనిపల్లి-వెల్దండ వరకు నూతనంగా నిర్మిస్తున్న బీటీరోడ్డు పనుల్లో భాగంగా కల్వర్టులను నాణ్యతగా చేపట్టాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో కుప్పగండ్ల సమీపంలో నిర్మిస్తున్న కల్వట్ల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆచారి మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు మట్ట పరమేష్‌గౌడు, నాయకులు సుబ్బయ్యగౌడు, యాదయ్య, నాగరాజు, భీమయ్య, విజయ్‌కుమార్, విష్ణు, వేణుగోపాల్, భాను ప్రకాష్ ఉన్నారు.

ఆర్టీసీ యాత్రదానంలో భాగస్వాములు కండి

కొల్లాపూర్: ఆర్టీసీ అమలు చేస్తున్న యాత్రదానం కార్యక్రమంలో ఎన్నారైలు, స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వ్యక్తుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభకార్యాల సందర్భంగా ఆర్టీసీకి తమ వంతు ఆర్థిక సాయం అందిస్తే ఆ డబ్బులతో వృద్ధులు, అనాథలు, దివ్యాంగులు, పేదలను పుణ్యక్షేత్రాలు, విజ్ఞాన, విహారయాత్రలకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ప్రత్యేక శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించాలి

ఉప్పునుంతల: ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎంఈఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని పీఎస్ లత్తీపూర్, యూపీఎస్ గువ్వలోనిపల్లి, యూపీఎస్ ఫిరట్వానిపల్లి పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. బోధనభ్యాసన పరికరాలతో విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తాం

కందనూలు: ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ అన్నారు. తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి, మన జిల్లాకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. అనంతరం డీఈఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సాధుల మధుసూదన్, ట్రెజరర్ రాఘవేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూలు జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రటరీ హలరాజు, ట్రెజరర్ వెంకటేష్ పాల్గొన్నారు.

నల్లమలలో బీజేపీ జెండా ఎగురవేయాలి

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో నల్లమలలో బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో అచ్చంపేటకు చెందిన బీజేపీ నాయకులు రామచందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. అచ్చంపేట ప్రాంత విషయాలను చెప్పారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు రాష్ట్ర కార్యదర్శిగా చోటు దక్కడంతో నల్లమలలో పార్టీ బలోపేతం కానుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రామచందర్‌రావు, భరత్‌ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాములు, రాష్ట్ర నాయకులు వీరేందర్‌గౌడ్, రాజ్‌భూపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం చెరువులో లారీ అదుపుతప్పి ఒరిగిపోయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తాడూరు వైపు వెళ్తున్న లారీ కేసరి సముద్రం చెరువుపై ఉన్న కల్వర్టు మీద వెళ్తుండగా రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి చెరువులోకి పడిపోతుండగా అప్రమత్తమైన డ్రైవర్ లారీని అదుపుచేశాడు. దీంతో ఒక పక్క ఒరిగిపోయి ఆగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: ఉరేసుకుని యువకుడు జిల్లా కేంద్రంలో గురువారం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాదత్ స్ట్రీట్‌కు చెందిన మహ్మద్ బురాన్ (20) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు కూలీ పనులకు వెళ్లి తిరిగివచ్చేలోపు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయానికి రూ.5లక్షల విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో విశ్రాంతి గది నిర్మాణం కోసం ఉప్పునుంతల మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ, నర్సింహారెడ్డి రూ.5లక్షల విరాళం అందజేశారు. ఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులు ఉద్యమించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం కార్మికులు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 15లక్షల మందికి పైగా భవన నిర్మాణ రంగంలో నమోదు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, శ్రీనివాసులు, వెంకటస్వామి, రవీందర్, విజయ్, సురేష్, సింగోటం, నరసింహ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఉండాలి

తిమ్మాజిపేట: గ్రామ రక్షణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో అవసరమని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని బావాజిపల్లి లో శుక్రవారం రాత్రి సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్ నేరాలపై అప్రమత్తత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య, నర్సింహ, నాయకులు ఆంజనేయులు, రామకృష్ణగౌడ్, అశోక్‌గౌడ్, ఖదీర్, చోటే పాల్గొన్నారు.

వర్కర్ల నిరవధిక సమ్మె



మన్ననూర్/లింగాల: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న డైలీవైజ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర నాయకుడు సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓంప్రకాష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మన్ననూరు ఆశ్రమ పాఠశాల, బాలుర వసతి గృహంలోని డైలీవైజ్ వర్కర్స్ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్టీ బాలుర వసతి గృహం, మండలంలోని అప్పాయపల్లి, క్యాంపురాయవరం ఆశ్రమ పాఠశాలలకు చెందిన వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక

వెల్దండ: మండల కేంద్రంలోని బుధార్‌పేట్ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం మండల ఆర్య వైశ్య సంఘం సమావేశం నిర్వహించి దేవీ శరన్నవరాత్రి ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు.

ఘనంగా వీడ్కోలు

చారకొండ: చంద్రాయన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న జూలూరు వెంకటరమణ వంగూరు మండలంలోని రంగాపూర్‌కు బదిలీపై వెళ్లడంతో వారికి చంద్రాయన్‌పల్లిలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. వెంకటరమణ దంపతులకు వీడ్కోలు పలుకుతూ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.